సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం ; 24 ; మే ; 2024



ఉత్సాహంగా ఉప్పు సాగు

నరసాపురం తీర ప్రాంతంలో ఉప్పుసాగు ఉత్సాహంగా సాగుతోంది. ఎన్నడూ లేని విధంగా ఉప్పునకు గిట్టుబాటు ధర పెరగడంతో రైతులు ఆనందిస్తున్నారు. 8లో ▸



ఆద్యంతం ఆసక్తికరం

తాడేపల్లిగూడెంలో జాతీయస్థాయి 31వ ఉగాది నాటికల పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. గురువారం రెండు నాటికలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. 8లో ▸

పశ్చిమ జట్ల హవా

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్లు సత్తా చాటుతున్నాయి. యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఫైనల్స్‌కు చేరడమే లక్ష్యంగా పోటీ పడుతున్నాయి. 8లో ▸



న్యూస్‌రీల్

కేంద్ర బృందం పర్యటన



పేకేరు సచివాలయంలో కేంద్ర బృంద అధికారులు

ఇరగవరం: ఢిల్లీ నుంచి కేంద్ర సచివాలయ సెక్షన్ అధికారులు గురువారం పేకేరు గ్రామంలో సచివాలయాన్ని సందర్శించారు. భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారత, మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ కునుకు హేమకుమారి ఆయా వివరాలు వారికి తెలియజేశారు. ఇటీవల సర్పంచ్ హేమకుమారి ఐక్యరాజ్య సమితిలో మహిళా సాధికారతపై దేశం తరపున ప్రాతినిధ్యం వహించడంపై కేంద్ర బృందం ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఎం.నవీన్‌కింగ్, అభిషేక్ దీక్షిత్, అభిషేక్ గుప్త, అప్రజిత రావత్, ఫాతిమా, కృష్ణకుమార్, ఈఓఆర్డీ పీవీఎల్ నరసింహమూర్తి, కార్యదర్శి పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో క్యాంపస్ సెలెక్షన్స్



తాడేపల్లిగూడెం: మండలంలోని వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీలో జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ ప్రతినిధులు గురువారం క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. బీఎస్సీ హార్టీకల్చర్ ఫైనలియర్ విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూపు డిస్కషన్స్, ఇంటర్వ్యూలను నిర్వహించగా 64 మంది విద్యార్థులకు 43 మంది గ్రూపు డిస్కషన్స్‌కు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూల ఆధారంగా సుమారు 20 మంది విద్యార్థులను ఎగ్జిక్యూటివ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్‌గా ఎంపిక చేయనున్నామని కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, హ్యూమన్ రీసోర్స్ మేనేజర్ టి.రఘు, అగ్రనామిస్ట్ పి.రాజు తెలిపారు. ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ పర్యవేక్షించారు. వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

25న డీఈఓ పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ టెస్ట్



ఉదయభాస్కరరావు, డీఆర్వో

భీమవరం: ఏపీపీఎస్సీ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈఓ) పోస్టుల భర్తీకి నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ కోసం జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఆర్వో జె.ఉదయభాస్కరరావు గురువారం తెలిపారు. 25న ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని, భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్, విష్ణు ఇంజనీరింగ్, డీఎన్నార్ అటానమస్ కళాశాల, నరసాపురంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెంలో వాసవి ఇంజనీరింగ్ కళాశాల, శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. మొత్తంగా 840 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష నిర్వహణకు ఆరుగురు తనిఖీ అధికారులు, మరో ఆరుగురు చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలలోపు కేంద్రాల వద్దకు రావాలన్నారు.

ముగిసిన ఈఏపీసెట్

భీమవరం: భీమవరంలో ఈనెల 16న ప్రారంభమైన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్, డీఎన్నార్ ఇంజనీరింగ్, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16,17 తేదీల్లో ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాలకు, ఈనెల 18 నుంచి ఇంజనీరింగ్ విభాగానికి పరీక్షలు జరిగాయి. చివరి రోజు ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 171 మందికి 159 మంది, డీఎన్నార్ కళాశాలలో 150 మందికి 143 మంది, విష్ణు కళాశాలలో 100 మందికి 98 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నేటి నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

భీమవరం: జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ గురువారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాల్లో 8,953 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్షలకు సంబంధించిన సలహాలు, సూచనల కోసం విద్యాశాఖ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సెల్ 83098 83816లో సంప్రదించవచ్చని సూచించారు.

హై అలర్ట్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రత్తమైంది. హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు జిల్లావ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. బాణసంచా, లూజ్ పెట్రోల్ విక్రయాలపై నిషేధం విధించారు. కౌంటింగ్ రోజున విజయోత్సవాలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని ఇప్పటికే అభ్యర్థులకు పోలీసు శాఖ నోటీసులు జారీ చేసింది.



కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

- కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తం
- హింసాత్మక ఘటనలు జరగకుండా చర్యలు
- జిల్లావ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్
- బాణసంచా, లూజ్ పెట్రోల్ విక్రయాలపై నిషేధం
- అమలులో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్
- ఊరేగింపులు, ర్యాలీలు బంద్
- అల్లర్లకు ఉసిగొలిపితే కఠిన చర్యలే
- అభ్యర్థులకు పోలీసుల నోటీసులు

సాక్షి, భీమవరం: జిల్లాలో పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో ఎస్పీ డాక్టర్ అజిత సఫలీకృతమయ్యారు. అదే ఒరవడిలో జూన్ 4న జరిగే కౌంటింగ్ విజయవంతానికి చర్యలు చేపట్టారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే అవకాశమున్నట్టు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారంతో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకూ తరచూ వివాదాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. పోలీస్ శాఖ ఆదేశాలను పెడచెవిన పెట్టి ప్రవర్తించే వారిపై అవసరమైతే రౌడీషీట్‌లు ఓపెన్ చేయనున్నట్టు పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో బైండోవర్ చేసిన వ్యక్తులు ఏమైనా అవాంఛనీయ ఘటనల్లో పాల్గొంటే వారికి జరిమానాలు విధించనున్నట్టు చెబుతున్నారు.

బంకుల యజమానులకు ఆంక్షలు

అరాచకశక్తులు పెట్రోల్ బాంబులు, పేలుడు స్వభావం కలిగిన బాణసంచా సామగ్రితో అల్లర్లు సృష్టించేందుకు ఆస్కారముండటంతో పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో లూజ్ విక్రయాలు చేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు నోటీసులు జారీచేశారు. బాణసంచా విక్రయాలపైనా ఆంక్షలు విధిస్తూ తయారీదారులకు ఆదేశాలిచ్చారు.

కార్డన్ అండ్ సెర్చ్‌లు : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడేందుకు ఇతర ప్రాంతానికి చెందిన పాత నేరస్తులు, రౌడీషీటర్స్ ఎవరైనా వచ్చి స్థానికంగా నివాసం ఉంటున్నారా?, హింసను ప్రేరేపించేలా ఆయుధాలు, కర్రలు ఇతర వస్తువులు ఎవరైనా కలిగి ఉన్నారా?, పెట్రోల్, డీజిల్, బాణసంచా తదితర వాటిని ఎవరైనా నిలువ ఉంచారా?, నేరాలకు పాల్పడడానికి పత్రాలు లేని వాహనాలను ఎవరైనా కలిగి ఉన్నారా? అనే అంశాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కొద్దిరోజులుగా కార్డన్ అండ్ సెర్చ్‌లు పేరిట పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బలగాలతో జిల్లా అంతటా సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలను జల్లెడ పడుతున్నారు. గురువారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించడంతో పాటు సక్రమంగా రికార్డుల్లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యముంది. ఎన్నికల ప్రక్రియలో ఘర్షణలు, హింసకు తావులేదు. శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎటువంటి చర్యలను ఉపేక్షించం. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే పోలీస్ పికెట్‌లు ఏర్పాటుచేశాం. జూన్ 4న ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్‌కు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాం. అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించి ఘర్షణలను నివారించేందుకు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నాం. ప్రజలంతా సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరుతున్నాం. ఎవరైనా గొడవలు, ఘర్షణలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని తెలిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు గాని, డయల్ 100/112 లకు గాని కాల్ చేసి సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

–డాక్టర్ అజిత, జిల్లా ఎస్పీ

విజయోత్సవాలపై నిషేధం

కౌంటింగ్ రోజు జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలపై నిషేధం విధించారు. ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, బాణసంచా కాల్చరాదని, ఎవరూ గుంపులుగా ఉండకూడదని పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అల్లర్లలో పాల్గొనే వారి వాహనాలు సైతం సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. అల్లర్లను ప్రోత్సహించేలా కేడర్‌ను ఉసిగొలిపితే కఠిన చర్యలు తప్పవని అభ్యర్థులకు పోలీసులు నోటీసులు కూడా ఇస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సాధారణ ఎన్నికలు–2024లో భాగంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు హాజరయ్యారు. జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లను సీఈఓకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో రెండు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, నాలుగు రోజుల్లో ఏర్పాట్లు పూర్తిచేస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు పార్లమెంటరీ నియోజకవర్గానికి 10 టేబుళ్లు, ప్రతి నియోజకవర్గానికి 4 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఎన్నికల సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సన్యాసిరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

భీమవరం: స్థానిక విష్ణు కళాశాల ఆవరణలోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా చర్యలను కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్‌లో భాగంగా టేబుళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా సెంటర్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు మీడియాకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, డీపీఆర్వో టి.నాగేశ్వరరావు ఉన్నారు.



సోమేశ్వరుడి శోభ

భీమవరం గునుపూడిలోని పంచారామక్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానం (సోమారామం)లో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం స్వామి వారికి మామిడి పండ్లతో అలంకరణ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- భీమవరం (ప్రకాశంచౌక్)

శ్రీవారి రథోత్సవం రద్దు

- అనివార్య కారణాలతో నిలిచిన వేడుక
- ఆకట్టుకున్న రాజమన్నార్ అలంకారం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించాల్సిన రథోత్సవం అనివార్య కారణాలతో రద్దయ్యింది. వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఉదయం నుంచి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గుడి సెంటర్‌లో రథాన్ని సుగంధభరిత పుష్ప మాలికలు, విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అయితే అనివార్య కారణాలు వల్ల రథ యాత్రకు ఆటంకం కలిగింది. దీంతో అర్చక స్వాముల సూచనల మేరకు ఆలయ అధికారులు వేడుకను రద్దు చేశారు. ఇదిలా ఉంటే ఆలయ ముఖ మండపంలో స్వామివారు రాజమన్నార్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



రాజమన్నార్ అలంకారంలో శ్రీవారు



గుడి సెంటర్‌లో ముస్తాబైన శ్రీవారి రథం

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి–భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి భక్తిగీతాల ఆలాపన
- ఉదయం 10.30 గంటల నుంచి – చక్రవారి – అవభృథోత్సవం
- ఉదయం 11 గంటల నుంచి – కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలు
- మధ్యాహ్నం 3 గంటల నుంచి – వేద సభ
- సాయంత్రం 4 గంటల నుంచి – నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి – అన్నమాచార్య భక్తి గీతాలాపన
- సాయంత్రం 5 గంటల నుంచి – కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుండి – పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ
- రాత్రి 8 గంటల నుండి అశ్వవాహనంపై గ్రామోత్సవం
- ప్రత్యేక అలంకారం : మురళీకృష్ణ

పక్కాగా పథకాల లబ్ధి

- ఎన్నికల ముందు అడ్డుకున్న చంద్రబాబు
- పోలింగ్ ముగిసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ
- వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ నిధుల విడుదల



భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుగా సాగిన జగనన్న సర్కారు ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా పథకాల లబ్ధిని ప్రజలకు అందించి చరిత్ర సృష్టించింది. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఐదేళ్లపాటు పాలన సాగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. విద్యార్థులు, రైతులు, మహిళలకు అన్నివిధాలా అండగా నిలిచారు. ఎన్నికల తర్వాత ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు గతంలో ఉండగా.. ఇందుకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకాల లబ్ధిని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసి చిత్తశుద్ధిని చాటుకుంది. ఇలా జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసింది.

సంక్షేమాన్ని అడ్డుకున్న చంద్రబాబు

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సార్వత్రిక ఎన్నికల పేరుతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుట్ర రాజకీయాలతో అడ్డుకున్నారు. నాలుగేళ్ల పాటు అందించిన సంక్షేమంలో భాగంగా ఐదో ఏడాది కూడా సీఎం జగన్ వరుస క్రమంలో ప్రజలకు సంక్షేమ పథకాలు, విద్యార్థులకు ఫీజు సాయం, రైతులకు పంట నష్టం, చేయూత సాయం వంటివి అందిస్తుండగా చంద్రబాబు అడ్డుతగిలారు. దీంతో ఎన్నికల సంఘం ఆయా పథకాల లబ్ధిని అందించవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 13న ఎన్నికల పోలింగ్ పూర్తికావడంతో అడ్డంకులు తొలగడంతో ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో ఆయా మొత్తాలను జమ చేస్తోంది.

చేయూత రూ.130.71 కోట్ల జమ

45 ఏళ్ల దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ.18,750 చొప్పున మూడేళ్ల పాటు ప్రభుత్వం అందించింది. నాలుగో విడత సాయం నిలిచిపోగా పోలింగ్ అనంతరం జిల్లాలో 69,712 మంది మహిళల ఖాతాలకు ప్రభుత్వం రూ.130.71 కోట్లు జమ చేసింది. క్రమంగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమవుతోంది. మొత్తంగా చేయూత పథకంలో నాలుగు విడతల్లో జిల్లాలో 2,83,718 మంది లబ్ధిదారులకు రూ.523.92 కోట్లను ప్రభుత్వం అందించింది.

ఆసరా పెండింగ్ క్లియర్

డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పేరిట సీఎం జగన్ డ్వాక్రా రుణామాఫీ చేశారు. జిల్లాలో నాలుగు విడతల్లో 27,013 సంఘాలకు రూ. 1,104.46 కోట్లు అందజేశారు. ఎన్నికల పోలింగ్ అనంతరం పెండింగ్ ఆసరా నిధులు క్లియర్ చేశారు.

విద్యా దీవెన రూ.94.7 కోట్లు

విద్యార్థులకు విడతల వారీగా జగనన్న విద్యా దీవెన పేరిట ప్రభుత్వం పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. నాలుగో విడత విద్యా దీవెన పంపిణీకి ఎన్నికల కమిషన్ అడ్డుకోగా నిధులు నిలిచిపోయాయి. పోలింగ్ అనంతరం విద్యా దీవెన నిధులు విడుదల చేయడంతో జిల్లాలో 33,527 మంది విద్యార్థులకు రూ.94.7 కోట్ల లబ్ధి చేకూరింది.

ఇన్‌పుట్ సబ్సిడీ రూ.25.98 కోట్లు

జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 15,564.89 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం రైతులకు ఉచిత పంటల బీమా పథకంలో బీమా చేయించింది. దీంతో జిల్లాలో పంట నష్టపోయిన 31,393 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.25.98 కోట్లను ప్రభుత్వం ఎన్నికల పోలింగ్ తర్వాత విడుదల చేసింది.

కమనీయం.. కాళ్లకూరు రథోత్సవం



కాళ్లకూరులో రథోత్సవ దృశ్యం

కాళ్ల: కాళ్లకూరులో వేంకటేశ్వరస్వామి (వెంకన్న) తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. తొలుత రథంపై ఆశీనులైన స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, భక్తులు రథాన్ని లాగి రథోత్సవం ప్రారంభించారు. రథోత్సవంలో బుట్టబొమ్మలు, శక్తివేషాలు, తీన్మార్ డప్పులు, మేళతాళాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో పాల్గొన్న భక్తులతో ఊరంతా జనసంద్రంగా మారింది. పురవీధుల మీదుగా సాగిన రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి నిత్యోపాసన, బలిహరణ, పంచసూక్త హవనం, రజత పుష్పాలతో విశేష పూజ, నీరాజన మంత్రపుష్ప ప్రసాద వినియోగం వంటి పూజాదికాలు జరిపించారు. ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. జువ్వలపాలెం రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

కౌంటింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

అధికారులకు కలెక్టర్ సూచన

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల ప్రక్రియలో కౌంటింగ్ అత్యంత కీలకమని, చిన్నపాటి పొరపాట్లకు తావివ్వొద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా రిటర్నింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ పూర్తిచేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు (రిజర్వ్ సిబ్బందితో సహా) ఉదయం 6 గంటలలోపు కేంద్రాల వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలైనందున లెక్కింపునకు ఎక్కువ సమయం పడుతుందని, ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు శనివారం మొదటి విడత శిక్షణ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ హాళ్లలో సీసీ టీవీలు ఉంటాయని, మొత్తం ప్రక్రియ అంతా వీడియో రికార్డింగ్ చేస్తారన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో జాగ్రత్తలు, తొలివిడత, మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. కౌంటింగ్ హాలులో రిటర్నింగ్ అధికారులదే సర్వాధికారమని, వారే పూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారన్నారు. కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

మట్టి రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లు సీజ్

నిడమర్రు: చానమిల్లి గ్రామంలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దారు కె.పోసిబాబు చెప్పారు. గురువారం చానమిల్లి గ్రామంలో గనులు, భూగర్భశాఖ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా పొలాల్లోని మట్టిని తవ్వితరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే ఆయా ట్రాక్టర్లను తహసీల్దారు కార్యాలయం వద్ద సీజ్ చేసి, మట్టిని తరలిస్తున్న యర్ర సాయి (బావాయిపాలెం), అచ్యుత వెంకట సత్యరామాంజనేయులు (రావులపాలెం), దాసరి జయరాజు (జగ్గవరం గ్రామం, టి.నరసాపురం మండలం)లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మట్టిని ఒకచోట నుంచి మరో చోటికి తరలించాలంటే తప్పనిసరిగా అధికారులు అనుమతుల తీసుకోవాలన్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తరలిస్తే భూయజమానులపై, మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న వ్యక్తులు, వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఆర్ఐ ఆర్.సుబ్బారావు, వీఆర్వో ఏడుకొండలు తదితరులున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఇద్దరు నిర్వాహకులతో పాటు ఆరుగురి అరెస్టు



తణుకులోని వ్యభిచార గృహంపై దాడి చేసిన పోలీసులు

తణుకు: తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు గురువారం దాడి చేశారు. వెంకట్రాయపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురు రోడ్డులో ఒక ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చంద్రు శ్రీనివాస్, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మి ఇద్దరూ కలిసి ఇల్లు అద్దెకు తీసుకున్నారు. వాట్సప్ ద్వారా విటులను ఆకర్షించేందుకు అమ్మాయిల ఫొటోలతో సోషల్ మీడియాలో ఉంచారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులకు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేసి ఇద్దరు నిర్వాహకులతో పాటు ఇద్దరు యువతులు, మరో ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన బావమరిది తిరిగి రాలేదంటూ దంతులూరి రమేష్‌కుమార్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టుటౌన్ ఎస్సై రమేష్ గురువారం చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన నడింపల్లి ఫణిరాజు ఈనెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి అతని కోసం పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో బావమరిది రమేష్‌కుమార్‌రాజు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్సాహంగా ఉప్పు సాగు

- పెరిగిన గిట్టుబాటు ధరతో ఆనందం
- గతంతో పోలిస్తే సగానికి తగ్గిన విస్తీర్ణం
- భయపెడుతున్న అకాల వర్షాలు



నరసాపురం మండలం పెదమైనవానిలంకలో ఉప్పుసాగు చేస్తున్న దృశ్యం



పండించిన ఉప్పును గట్టు మీదే గుట్టలుగా నిల్వ ఉంచిన దృశ్యం (ఫైల్)

నరసాపురం: జిల్లాలోని నరసాపురం తీరంలో ఈ ఏడాది ఉప్పు సాగు ఉత్సాహంగా సాగుతోంది. రైతులు మార్చి నెల ప్రారంభంలోనే సాగుకు ఉపక్రమించారు. ప్రస్తుతం తీర గ్రామాల్లో ఉప్పు సాగు ముమ్మరంగా సాగుతోంది. ఓ పక్క ఎప్పుడూలేని విధంగా ఉప్పుకు గిట్టుబాటు ధర పెరిగింది. దీంతో రైతులు ఆనందంగా ఉన్నారు. అదే సందర్భంలో కొన్నిరోజులుగా అకాల వర్షాలు, వాతావరణశాఖ రానున్న రోజుల్లో తుపాను హెచ్చరికలు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో నరసాపురంలో 19 కిలోమీటర్లు ఉన్న తీరప్రాంతంలో 1,500 ఎకరాల్లో ఉప్పు సాగు చేపట్టారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వేములదీవి, తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, కేపీపాలెం తదితర 8 గ్రామాల్లో ఉప్పుసాగు జరుగుతోంది.

జిల్లాలో తీర ప్రాంతం	ఉప్పు సాగు చేసే గ్రామాలు	ఏటా తీరంలో ఉత్పత్తి అయ్యే ఉప్పు
19 కిలోమీటర్లు	8	2 వేల టన్నులు
ప్రస్తుతం ఉప్పు సాగు చేసే విస్తీర్ణం	**ఉప్పు సాగుపై ఆధారపడి జీవిస్తున్న రైతులు**	**పరోక్షంగా ఉప్పు సాగుపై ఆధారపడి జీవిస్తున్న వారు**
1500 ఎకరాలు	800 మంది	2 వేల మంది

6 నెలల వరకూ దిగుబడి : ఉప్పు సాగు సమష్టి కృషితో కూడుకున్న పని. ఒక్కసారి మడి కడితే దాదాపు ఆ మడి నుంచి 6 నెలల వరకూ ఉప్పు తీస్తుంటారు. దీంతో ఉప్పు సాగు లాభాలు తెచ్చిపెడుతుంది. వేసవి ప్రారంభంలో ఏటా మార్చిలో ఉప్పుసాగు ప్రారంభం అవుతుంది. మండే ఎండల్లో చిన్న చిన్న మడులను ఏర్పాటు చేసి ఉప్పు సాగు చేస్తారు. ఒక్కో ఎకరానికి సంబంధించి 60 నుంచి 70 మడులను కడతారు. ముందుగా మడుల్లో మట్టిని కాళ్లతో తొక్కి చదును చేసి తరువాత సముద్రంలోని ఉప్పు నీటిని ఆ మడుల్లో నింపుతారు. ఇక సాగు ప్రారంభమైన నాటి నుంచి మడుల్లో 60 రోజుల పాటు 6 నుంచి 10 మంది విపరీతంగా శ్రమిస్తేనే కానీ ఉప్పు తయారీ కాదు. ఉప్పుమడి నుంచి దాదాపు 6 నెలలు వరకూ ఉప్పు ఉత్పత్తి చేస్తారు. ఒక్కో ఎకరానికి పెట్టుబడి రూ.15,000 నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతూ ఉంటుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రోజుకు 100 కిలోల వరకూ ఉత్పత్తి వస్తుంది.

పెరిగిన గిట్టుబాటు ధర

ఇటీవల పండించిన ఉప్పుకు గిట్టుబాటు ధర కూడా పెరగడంతో రైతులు ఒకింత ఆనందంలో ఉన్నారు. ఏడాది క్రితం తీరంలో పండించే ఉప్పు బస్తా (50 కిలోలు) రైతుల వద్ద దళారులు రూ.100కు కొనేవారు. ప్రస్తుతం బస్తా ధర రూ.300 పలుకుతోంది. గిట్టుబాటు ధర మూడు రెట్లు పెరిగిన ఆనందంలో రైతులు ఉన్నారు. వాతారణం సహకరించి అకాల వర్షాల బెడద లేకుండా ఉంటే రైతులకు నాలుగు డబ్బులు వస్తాయి. కొన్ని రోజుల నుంచి అకాల వర్షాలు భయపెడుతున్నాయి. ఇప్పటికైతే పరవాలేదని, కానీ భారీ వర్షాలు పడితే మాత్రం ఉప్పు రైతులు నష్టపోతారు.

సగానికి తగ్గిన సాగు విస్తీర్ణం...

నరసాపురం తీరం నుంచి ఉప్పు ఆంధ్రా, తెలంగాణలోని పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ఉభయగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఉప్పు సరఫరా అవుతోంది. కొంతకాలంగా ఉప్పు సాగు కష్టాల సుడిలో కొట్టుమిట్టాడుతోంది. ఎక్కువ శ్రమ, తక్కువ రాబడితో రైతులు సాగుకు మొగ్గుచూపడంలేదు. క్రమంగా తీరంలో ఉప్పుమడులు చేపలు, రొయ్యల చెరువులుగా మారుతున్నాయి. ఆక్వా వైపు ఉప్పు రైతులు అడుగులు వేస్తున్నారు. 10 ఏళ్ల క్రితం తీరంలో దాదాపు 15 గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో ఉప్పుసాగు జరిగేది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం సగానికి సగం పడిపోయింది.

పంటకు బీమా కల్పించాలి

పండించిన ఉప్పును భద్రపరచుకోవడానికి గిడ్డంగులు లాంటి సదుపాయాలు లేవు. గిడ్డంగులు ఉంటే వర్షాలు వచ్చినప్పుడు పండించిన ఉప్పును వాటిలో భద్రపరుచుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. పండించిన ఉప్పును రైతులు ఆరుబయటే కుప్పలుగా పోసి ఉంచుతారు. దీంతో పండించిన ఉప్పు పంటకు రక్షణ ఉండదు. అకస్మాత్తుగా వర్షాలు పడినా, తుపాన్లు వంటి విపత్తులు వచ్చినా ఉప్పు కుప్పలు ధ్వంసమైపోతాయి. ఉప్పు పంటకు బీమా లాంటి సదుపాయాలు ఉండవు. ఉప్పు సాగును అధికార పంటగా గుర్తించాలని, మిగిలిన పంటలకు మాదిరిగా అందించే సదుపాయాలు కలుగజేయాలనే డిమాండ్ ఎంతోకాలంగా ఉంది.

గత ఏడాదంతా నష్టమే



మార్చి నెలలోనే ఉప్పుసాగు సీజన్ మొదలవుతుంది. ఈ ఏడాది అలాగే ప్రారంభమైంది. గత ఏడాది జూన్, జూలై నెలల్లోనే అధిక వర్షాలు పడ్డాయి. దీంతో మడుల్లోకి నీరు చేరింది. అప్పటికే పండించిన ఉప్పును అయిన కాడికి అమ్మున్నాం. అన్నీ నష్టాలే మిగిలాయి. ఈ ఏడాది కూడా వర్షాలు భయపెడుతున్నాయి. ముమ్ముందు వాతావరణం ఎలాగుంటుందో చూడాలి.

మైలా ముత్యాలరాజు,
ఉప్పు రైతు, పెదమైనవానిలంక గ్రామం

ధర పెరగడంతో లాభాలు



50 కేజీల బస్తా రూ.300 పలుకుతోంది. ఈ మధ్యనే రేటు పెరిగింది. గత ఏడాది వరకూ బస్తా రూ.100కు మించి ఇచ్చే వారు కాదు. రొయ్యల చెరువులకు కూడా ఉప్పును ఉపయోగించడంతో డిమాండ్ పెరిగి రేటు పెరిగింది. ఈ ఏడాది కాస్త లాభాలు చూస్తామనుకుంటున్నాం.

– పొన్నమండ నాగరాజు, ఉప్పు రైతు,
తూర్పుతాళ్లు, నరసాపురం మండలం

ఆద్యంతం ఆసక్తికరంగా నాటిక పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 31వ ఉగాది నాటికల పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. గురువారం నాలుగో రోజు ప్రదర్శించిన అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక, హైదరాబాద్ వారి సిరిమువ్వ కల్చరల్ థింక్ నాటికలు సందేశాత్మకంగా సాగాయి. రచయిత పంపన దయానంద బాబు, ఆడిటర్ మహమ్మద్ ఖాజావలి, ఉత్తమ ఉపాధ్యాయులు లంక రుద్రమూర్తి, వంగా నరసింహారావు, ఆక్వాకల్చర్ టెక్నికల్ హెడ్ వైవీ రమణలకు గౌరవ విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, పైలు శ్రీనివాస్ పర్యవేక్షించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, సాహితీ సభ్యులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.

ఇంద్రప్రస్థం

ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే. కానీ ఆ ప్రేమలు హర్షించేలా ఉండాలే తప్ప అనాలోచితంగా, వెర్రిగా పరిగెడితే జీవితం విలువలు నాశనమవుతాయి. సర్వేశ్వరరావు ఒక నాన్న, ఒక గురువు, ఒక నిర్దేశకుడు, అంతకు మించి ఒక గొప్ప వ్యక్తి. తన కొడుకు ఎవరో అమ్మాయిని ప్రేమించాడు గదా అని సంబరపడలేదు. తొందరపడలేదు. కొడుకు ప్రేమించిన ఆ అమ్మాయి తండ్రి గురించి ఆలోచించాడు. అతనూ తన లాంటి తండ్రే. అతనికీ న్యాయం చేయాలనుకున్నాడు. ఒక పక్క ప్రేమలో మునిగిపోయిన వాళ్ల తప్పుల్ని, తొందరపాటుతనాన్ని, సరిదిద్దుతూ, మరో పక్క కండీషన్స్‌తో కూడిన క్రమశిక్షణ నేర్పుతూ ఇంకో పక్క అమ్మాయి తండ్రికి అండగా నిలబడి ఓదారుస్తూ, ఒక నాన్నగా తనేం చెయ్యగలడో అది చేసి ఆదర్శవంతమైన తండ్రిగా నిలబడ్డాడు. ఇది ప్రతి కూతురు, ప్రతి కొడుకు నాన్న గొప్పదనాన్ని తెలుసుకోవాల్సిన సత్యం. అలువంటి నాన్న ఉంటేనే ఏ ఇల్లు అయినా ఇంద్ర ప్రస్థంలా వెలిగిపోతుంది. అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఇంద్రప్రస్థం నాటికను రచన గోపి సత్యప్రకాశ్ (స్నిగ్ధ), దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి.



ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

థింక్

నేటి సమాజంలో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తున్నారు. వాళ్లు అడిగిందల్లా ఇచ్చి సంతోషపెడుతున్నారు. వాళ్ల ప్రేమను పిల్లలకు తెలియజేయడం కోసం ప్రతిసారి అడిగినవన్నీ ఇచ్చి ఎందుకు? ఏమిటి? అని వాళ్లను ప్రశ్నించడం మానేశారు. అడిగితే పిల్లలకు కోపం వస్తుందని వాళ్లు బాధపడతారని అడగటం మానేశారు. దీనివల్ల పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ అలుసుగా మారింది. అలాంటి ఒక కుటుంబంలోని తల్లిదండ్రులు తమ కొడుకును గారాబంగా పెంచి అడిగిందల్లా ఇచ్చి చివరకు సమస్యలను ఎలా ఎదుర్కోవాలో, సమాజంలో ఎలా ఉండాలో చెప్పడం మరచిపోయారు. పరిస్థితుల ప్రభావం వల్ల కొన్ని సందర్భాలలో తల్లిదండ్రులు కాదు, లేదు, కుదరదు అని చెప్పడం, కొడుకు తాను అనుకున్నది జరగకపోవడంతో ఎటువంటి నిర్ణయం తీసుకున్నాడు? దాని వల్ల తల్లిదండ్రులు ఎటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు? అన్నీ కొడుకే అని బతికే ఆ తల్లిదండ్రులకు కొడుకు ఎలాంటి గాయం చేశాడు? ఈ సమాజంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎంతవరకు బాధ్యతగా ఉంటున్నారో తెలిపే ప్రయత్నమే ఈ నాటిక.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని అందిన సమాచారంపై ఏలూరు విద్యుత్ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక దాడులు చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ అధికారుల తనిఖీ సమయంలో పోతునూరి వెంకట సురేష్ అనే వ్యక్తి తన గృహంలోని ఏసీలకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వెంకట సురేష్‌పై కేసు నమోదు చేసి అతనికి రూ.45,235 అపరాధ రుసుము, రూ.3 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చింతపల్లి ఘటనలో నిందితులకు రిమాండ్

- పదో తరగతి విద్యార్థి ఘాతుకం
- ఫోన్ ద్వారా వీడియో తీసి వేధింపులకు దిగిన నలుగురు యువకులు
- పోలీసులను ఆశ్రయించిన బాధిత బాలిక తల్లి
- జువైనల్ హోంకు నిందితుడి తరలింపు
- నలుగురు యువకులపై పోక్సో కేసు నమోదు

కైకలూరు: ఏడో తరగతి చదువుతున్న విద్యార్థినిపై పదో తరగతి విద్యార్థి లైంగిక దాడికి పాల్పడగా..ఆ దృశ్యాన్ని రహస్యంగా సెల్‌ఫోన్‌లో వీడియో తీసిన నలుగురు యువకులు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఏలూరు జిల్లా మండవల్లి మండలం చింతపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న ఈ ఉదంతం చోటుచేసుకుంది. సమీప గ్రామానికి చెందిన బాలిక (14) కైకలూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. కొవ్వాడలంక గ్రామానికి చెందిన బాలుడు (16) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. ఆ పరీక్ష సరిఫికెట్లు తీసుకోవాలని పాఠశాలకు వచ్చాడు. అక్కడ కలిసిన బాలికకు మాయ మాటలు చెప్పి పాఠశాల వెనుక భాగానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇదే సమయంలో అటుగా వెళుతున్న యువకులు కొవ్వాడలంకకు చెందిన బలే బాల సుబ్రహ్మణ్యం, ఘంటసాల చంద్రశేఖర్, పెద్దిశెట్టి నాగధర్మ తేజ, జయమంగళ హరికృష్ణ ఈ లైంగిక దృశ్యాలను సెల్‌ఫోన్‌లో రహస్యంగా చిత్రీకరించారు. అనంతరం ఆ వీడియోలను చూపించి తాము అడిగిన సొమ్ము ఇవ్వకపోతే వాటిని సోషల్ మీడియాలో పెడతామంటూ బాలికను బెదిరించారు. ఆ బాలిక సొమ్ము ఇవ్వకపోవడంతో వారు వీడియోలను వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ చేశారు. దీంతో వాటిని చూసిన బాలిక తల్లి కూతురిని నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. మండవల్లి పోలీసులకు బుధవారం బాలిక తల్లి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు. బెదిరింపులకు పాల్పడిన యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఘంటసాల చంద్రశేఖర్‌పై ఇప్పటికే మూడు కేసులున్నాయి.

కఠినమైన కేసులు నమోదు చేశాం

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బాలుడిని ఇప్పటికే జువైనల్ హోంకి పంపించాం. లైంగిక దాడి వీడియోలను తీసి వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన నలుగురిపై పోక్సో కేసు నమోదు చేశాం. వీటితోపాటు కఠినమైన కేసులను అదనంగా నమోదు చేశాం. బాలిక తల్లి ఫిర్యాదు చేయగానే తక్షణం స్పందించాం. నిందితులు రిమాండ్‌లో ఉన్నారు.

– బి.కృష్ణకుమార్, కైకలూరు రూరల్ సర్కిల్, సీఐ

160 కిలోల గంజాయి స్వాధీనం

- మహారాష్ట్రకు చెందిన ఇద్దరి నిందితుల అరెస్టు
- కలపర్రు టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో పట్టివేత
- ఎస్ఈబీ ఏఎస్పీ సూర్యచంద్రరావు వెల్లడి



పట్టుబడిన గంజాయి, వాహనం, ఇద్దరు నిందితులు

ఏలూరు టౌన్: కలపర్రు టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా కారులో తరలిస్తున్న 160 కిలోల గంజాయిని పట్టివేసినట్లు ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ డీ.మేరీప్రశాంతి ఆదేశాలతో కలపర్రు టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం ఏలూరు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.విద్యాసుధాకర్, ఎస్సై పి.శివప్రసాద్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది వాహన తనిఖీలు చేయగా, ఓ కారులో 8 గోనెసంచుల్లో ఒక్కో సంచిలో 10 ప్యాకెట్లు చొప్పున, ప్రతి ప్యాకెట్‌లో రెండు కేజీల చొప్పున సుమారుగా 160 కిలోల గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ గంజాయి విలువ సుమారుగా రూ.10.55 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. ఈ గంజాయిని మహారాష్ట్ర థానే జిల్లా బిపన్ గ్రామానికి చెందిన అతిక్యూ అహ్మద్, బరమతి గ్రామానికి చెందిన జుమీర్ పింజరీ అనే ఇద్దరు వ్యక్తులు కారులో రవాణా చేస్తున్నారన్నారు. వీరిద్దరినీ ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పశ్చిమ జట్ల హవా



వరుస విజయాలు సాదిస్తున్న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ బాలబాలికల జట్లు సత్తా చాటుతున్నాయి. రెండురోజులుగా విజయవాడలో స్టెల్లా కాలేజ్ ఆవరణలో జరుగుతున్న 7వ రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు ప్రత్యర్థి జట్లను చిత్తుచేసి వరుస విజయాలు సాధిస్తున్నాయి. బుధవారం జరిగిన పోటీల్లో బాలికల జట్టు శ్రీకాకుళం జట్టును 45-08 స్కోర్ తేడాతో ఓడించింది. ఇదే క్రమంలో బాలుర జట్టు అనంతపురం జట్టుపై 47-31 స్కోర్‌తో గెలుపొందింది. గురువారం జరిగిన పోటీల్లో బాలికల జట్టు విశాఖపట్టణం జట్టును 54-28 స్కోర్‌తో, చిత్తూరు జట్టును 55-26 స్కోర్‌తో ఓడించి విజయ పరంపర కొనసాగించింది. బాలుర జట్టు కృష్ణా జిల్లా జట్టును 64-54 స్కోర్‌తో ఓడించి ముందంజ వేసింది. క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులు రమేష్, సత్యం అభినందించారు. శుక్రవారం జరిగే పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధిస్తే ఫైనల్‌కు చేసుకుంటాయని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్, కోశాధికారి కె మురళీకృష్ణ అన్నారు. ఈ నెల 21న ప్రారంభమైన ఈ పోటీలు 24న ముగుస్తాయి.

క్లుప్తంగా

వాసవీమాతకు అభిషేకాలు



విశేష అలంకరణ వాసవీ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ మాసం పౌర్ణమి పురస్కరించుకుని వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో గురువారం వాసవీ అమ్మవారికి ప్రధాన పురోహితులు సత్యనారాయణ శర్మ, తరుణ్‌శర్మ అర్చకత్వంలో పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో వివిధ ఫలరసాలతో విశేష అభిషేకాలు, పసుపు కుంకుమలతో విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి రజత చీరతో విశేష అలంకరణ గావించారు. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ సున్నా బాల త్రిపుర సుందరరావు, సెక్రటరీ ఆలపాటి కృష్ణకుమార్, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశయ్యలు పర్యవేక్షించారు. అధిక భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బలుసులమ్మకు ప్రత్యేక పూజలు



బలుసులమ్మ ఆలయంలో వైశాఖ పౌర్ణమి పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ పౌర్ణమి సందర్భంగా బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి 108 నూతన కలశములతో, సప్త నది జలాలతో అభిషేకాలు నిర్వహించారు. పంచలోహ సీతా రామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ చేశారు. నూతన రథ శాలను ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి పంచ హారతులు అందజేశారు. ఆలయ ఈఓ రవి శంకర్ పర్యవేక్షించారు. ఉత్సవకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



ప్రవక్తిని కె. అమ్మాజీ

పెంటపాడు: మానవుని ఆధ్యాత్మిక శాంతి జీవనానికి దేవుని యందు భయభక్తులు, విధేయత ఎంతో అవసరమని పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు, ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. పడాల మార్కెట్ యార్డు సమీపంలో బేతిరెడ్డి అమ్మిరెడ్డి స్థలంలో జరుగుతున్న క్రీస్తు సంపూర్ణసువార్త సభలు గురువారం రెండో రోజుకు చేరిన సందర్భంగా ఆమె దేవుని వాక్యం బోధించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడివాడకు చెందిన డబ్ల్యూ సీఎం సంఘ నాయకులు కిరణ్ పాల్ మాట్లాడుతూ బైబిలు వాక్యం ఆధారంగా విశ్వాసులు జీవనం సాగాలన్నారు. జిల్లా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కె. జాజిరాజు, సేవకులు కొమ్మిశెట్టి ఘనరాజు, గాయకులు శిరివెళ్ల హనోక్ తదితరులు దేవుని వాక్యం బోధించారు. పడాల, జట్లపాలెం, దువ్వ, యాగర్లపల్లి, ఉంగుటూరు మండలాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం విశాఖపట్నంకు చెందిన దైవసేవకులు శామ్యూల్ కర్మోజీ ఈ సభలలో పాల్గొంటారని పాస్టర్ జాజిరాజు తెలిపారు. యూత్, స్త్రీల సభల నాయకులు కీర్తనలు ఆలపించారు.

అనుమతి లేకుండా శీతల పానీయాల తయారీ



కూల్ డ్రింక్స్ తయారీ కర్మాగారంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా కూల్‌డ్రింక్స్ తయారు చేస్తున్న కర్మాగారంపై గురువారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. సెవన్ స్టార్ బాటిలింగ్ కంపెనీలో లెమన్ సోడా, సాఫ్ట్ డ్రింక్స్ తయారు చేస్తున్నట్టు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ యుజే.విల్సన్ తెలిపారు. చింతా శివకుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సీహెచ్.రంజిత్‌కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుందరరామిరెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను కాపాడాలి

పెనుగొండ: శాంతిభద్రతలకు విఘాతం కల్పించే విధంగా వివాదస్పద సంఘటనలు జరగకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకొని శాంతి భద్రతలను కాపాడాలని పెనుగొండ ఎస్సై ఎస్‌కే సుభానీ కోరారు. గురువారం పెనుగొండ మండలం వడలి పంచాయతీ వద్ద రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కౌంటింగ్ రోజున ఎలాంటి ర్యాలీలకు, మందుగుండు సామగ్రి ఉపయోగించడానికి అనుమతులు లేవన్నారు.

బంగారు భవితే లక్ష్యం

- దివ్యాంగులు బడిబాట పట్టేలా సమగ్రశిక్ష అధికారుల సర్వే
- ప్రత్యేక అవసరాలు గల బాలలకు వెనులుబాటు
- శిక్షణ, బోధనతో బాసట



పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో పదో తరగతిలో ఇటీవల మంచి ఉత్తీర్ణత సాధించిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు

పెంటపాడు: ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా వారికి మానసిక, శారీరిక తర్ఫీదులు ఇస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. గత ఏడాది సమీప పాఠశాలల్లో విద్య అభ్యసనకు సిద్ధమైంది. శారీరక, మానసిక వైకల్యం బారినపడిన పిల్లలకు ఇప్పటి వరకూ తమను ప్రత్యేకంగా విభజించారనేఉ బావన కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు విధివిధానాల అమలు కూడా ప్రారంభించింది. ప్రాథమిక పాఠశాల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మాటలు రాని మానసికంగా ఎదుగుదల లేని, నడవలేని పిల్లలు ఇళ్లలో ఉండి మరింత మానసికంగా కుంగిపోకుండా వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించారు. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధించారు. ఈ తరహా విద్య, శిక్షణలో వృద్ధిచెందిన వారిని ఆపై సాధారణ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరుగా కాకుండా వారిలో అందరూ సమానమనే భావనను పెంపొందింపజేసుందుకు సాధారణ విద్యార్థులతోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన చదువు చెప్పించేలా చర్యలు తీసుకుంది. దీని కోసం మండలానికి ఒక పాఠశాల ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాల్లో విలీనం చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలతో పిల్లలకు విద్యబోధిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు విద్యాదీవెన వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియో థెరపిస్టులు, వ్యాయామం, స్పీచ్‌థెరపీ, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఐఈఆర్‌టీలు, ఫిజియో థెరఫిస్టులు వారి పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుంది.

బహుళ ప్రయోజనాలు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చేరితే ప్రతి నెలా రూ.300 రవాణాభత్యం చెల్లిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ట్యాబ్‌లతో పాటు తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం ఏడాదికి రూ.9వేల నుంచి 11వేలు అందజేస్తారు. వైకల్యశాతం అధికంగా ఉంటే సదరమ్ ధ్రువపత్రంతో పింఛను వస్తుంది. బస్సు, రైల్వేలో పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారి ఇంటికి వచ్చి బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్టే హాజరు నమోదు అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకూ దివ్యాంగులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్య బోధిస్తాం. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం.

– విలీన విద్య ఉపాధ్యాయిని సాయి స్వరూప

ముగిసిన ఈఏపీ సెట్



ఏపీఈఏపీసెట్ రాయడానికి వచ్చిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఇంజనీరింగ్ ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు గాను వారం రోజులుగా సాగుతున్న ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు గురువారంతో ముగిసింది. పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 238 మందికి గాను 234 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రత్నాకర్‌రావు, పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

26న రంగ స్థల నెలవారీ కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 144వ నెలవారీ కార్యక్రమం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా రోడ్డు గీతా మందిరంలో ఈ నెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం 6గంటలనుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సూరంపూడి వెంకట రమణ, చింతకాయల వంశీకృష్ణ, మాసా బాబురావులు వెల్లడించారు. సత్య హరిశ్చంద్ర నాటకం నుంచి కాటి దృశ్యాలు ప్రదర్శించనున్నారు. నటులు కోపల్లె శ్రీనివాస్‌కు గౌరవ సత్కారం, పౌరాణిక నటులు పిప్పిరిశెట్టి వేంకటేశ్వరరావుకు కళా సత్కారం, సాహితీ సేవకులు డాక్టర్ సుంకర గోపాల్‌కు ఉద్యోగ సేవా పురస్కారం చేయనున్నారు. నెలవారీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



నీలాద్రిపురం గ్రామంలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



సాయిశ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలోని సాయిబాబా మందిరం వద్ద గురువారం వైశాఖ పౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన జలందరరావు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామానికి చెందిన సాయిశ్రీనివాస భజన సమాజం వారు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం సాయిబాబా మందిరం వద్ద భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ మెయిన్ రోడ్డు ఫీడర్, 11కేవీ రైల్వే ఫీడర్‌లకు పాతూరు 33/11కేవీ సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో జెడ్పీ స్కూల్ ఫీడర్‌కు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఏరియా, శేషమహల్ ఏరియా, నందిబొమ్మ సెంటర్ ఏరియా, మునిసిపల్ కార్యాలయం ఏరియా, రైల్వే స్టేషన్ రోడ్డు, జూబ్లీ రోడ్డు, వెంకటరత్నం ఆస్పత్రి ఏరియా, మసీద్ రోడ్డు, పాతూరు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివ్యాంగుల పిల్లలను గుర్తించండి



అంగన్‌వాడీ సెంటర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను గుర్తించి, పాఠశాలలో చేర్పించాలని యాగర్లపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విశాలాక్షి అన్నారు. దివ్యాంగుల పిల్లల గుర్తింపు కార్యక్రమం గురువారం పట్టణంలో నిర్వహించారు. విశాలాక్షి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌కి రావడం జరుగుతుందని, అంగన్‌వాడీ టీచర్స్ అందరూ అంగన్‌వాడీ పరిధిలో ఉన్న 18 సంవత్సరాల లోపు దివ్యాంగుల వివరాలను అందజేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందే విధంగా కృషి చేయాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వం ద్వారా అందించే వివిధ సంక్షేమ వివరాలను వెల్లడించారు. కరపత్రాలను ప్రదర్శించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, భవిత సెంటర్, పాఠశాలలో పేర్లు నమోదు చేయించాలన్నారు. ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్యశిబిరం



త్రిఫుల్ కర్మాగారంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: ప్రత్తిపాడు త్రిఫుల్ కర్మాగారంలో స్వాభిమాన్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు ఉచిత చర్మ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. బాబా ఆనందమూర్తి జన్మదినోత్సవం పురస్కరించుకొని ఏలూరు ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబికంలో 50 మందికి పైగా విద్యార్థులు, చిన్నారులు వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. అవసరమైన వారికి త్రిఫుల్ ఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇండస్ట్రీ డైరెక్టర్ ఓంప్రకాష్ గోయంకా, జనార్థన్, జీఎం హెచ్‌ఆర్ వేమాల శ్రీనివాస్, కో ఆర్డినేటర్ జి. శ్రీనివాసరెడ్డి, కంటివైద్యులు వై. రవిశంకర్, డాక్టర్ ఆదిత్య, వై. రమ్య డాక్టర్ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



తణుకు టౌన్: వేల్పూరు గ్రంథాలయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్న దృశ్యం



అత్తిలి: విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్‌లు వివరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

అత్తిలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ– చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను రిసోర్సుపర్సన్ కె కోమలి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, జె ప్రసాద్, పీవీ వెంకటేశ్వరరావు, నాగేంద్రవర్మ, ఎం శ్రీదేవి, ఆర్ దానకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పుష్పోత్సవం



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారికి పుష్పోత్సవం, (పవళింపు సేవ) జరిగింది. తొలుత స్వామి వారికి ద్వాదశ ప్రదక్షణాలు, నివేదనం, ఇతర పూజలు నిర్వహించారు. వాడపల్లి వెంకట అనంతకృష్ణామాచార్యులు, పెదపూడి గోపాలాచార్యులు బ్రహ్మత్వం వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో పునః నిర్మిస్తున్న నూతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద స్వామివారి కల్యాణం సందర్భంగా గురువారం రాత్రి వైభవంగా రథోత్సవం సాగింది. తొలుత ఆలయ అర్చకులు అగ్నిహోత్రం సుందర రామానుజాచార్యులు, దామోజీపురపు కుమార వెంకట నరసింహ అప్పారావు, కిషోర్, అర్చకస్వాములు బ్రహ్మత్వంలో విశేష పూజలు జరిగాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ట్రస్టుబోర్డు సభ్యులు, కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్, పి.కుమారస్వామి, ఆంజనేయులు సత్సంగ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన

పెనుగొండ: జిల్లాలో ఇసుక తవ్వకాలకు ఎక్కడా ఇప్పటి వరకూ అనుమతులు మంజూరు కాలేదని, అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని జిల్లా గనుల శాఖ అధికారి టి.జయప్రసాద్ హెచ్చరించారు. గురువారం పెనుగొండ మండలం సిద్ధాంతం, నడిపూడి, ఆచంట మండల కోడేరుల్లోని ఇసుక ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేవారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడా తవ్వకాలు జరపరాదని వివరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ సునీల్ కుమార్, ఇరిగేషన్ డీఈఈ పవన్, పొల్యూషన్ బోర్డు ఈఈ కే వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రాలు



తణుకులో సత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం



మండపాకలో జంగం ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

సేవా సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ అందజేస్తున్న వైనం

తణుకు అర్బన్: వేసవి సందర్భంగా మండుటెండలు తీవ్ర రూపం దాల్చుతున్న వేళ ప్రయాణికుల దాహార్తిని తీర్చుతున్నాయి చలివేంద్రాలు. గతంలో ఎన్నడూ లేనంతగా ఎండలు దానికి తోడు వడగాల్పుల కారణంగా ప్రయాణాలు చేయడం ఇబ్బందిగా మారింది. ఇది గుర్తించిన పలు స్వచ్ఛంద సేవా సంస్థలు తణుకు పట్టణ ప్రాంత పరిధిలో వేసవి ప్రారంభం కాగానే చలివేంద్రాలు ఏర్పాటు చేశాయి. దీంతో ప్రయాణికులు ఆ చలివేంద్రాల వద్ద ఆగి తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, చల్లని తాగునీరు అందజేస్తున్నారు. తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, వేల్పూరు రోడ్డులో స్వచ్ఛంద సేవా సంస్థలైన మానవత, సత్యసాయి సేవా సమితి, ఆర్యవైశ్య సేవా సమితి, తదితర సేవా సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లోని ప్రధాన కూడళ్లలోను బస్ స్టాండ్ ప్రాంతాల్లోను మజ్జిగ, చల్లని కూల్ వాటర్‌ను చలివేంద్రాల వద్ద ప్రయాణికులకు అందిస్తున్నారు. వేసవి తాపానికి భయదుతూ ప్రయాణికులంతా గొంతు తడుపుకునేందుకు చలివేంద్రాల వద్ద క్యూకడుతున్నారు.

మండపాకలో...

తణుకు మండలం మండపాక గ్రామంలో జంగం అర్జున (మాస్టర్) జ్ఞాపకార్థం ఆయన కుమారులు, కుటుంబసభ్యులు నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బస్ స్టాండ్ వద్ద వైఎస్సార్ సీపీ తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ, కూల్ వాటర్ అందజేస్తున్నారు.